ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16.12.2024 సమయం 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. సంక్రాంతి నుంచి 36 లక్షల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలియచేశారు.
2. గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన సుమారు 691 కోట్ల రూపాయలున్న బకాయిలను త్వరలో చెల్లించనున్నట్లు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.
3. భిన్నత్వంలో ఏకత్వమే ప్రపంచానికి భారతీయ సంస్కృతి అందించిన మహత్తర సూత్రమని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చెప్పారు.
4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు చలి తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలర్టు జారీ చేసింది.

----------

## COUNCIL - RATION CARDS

సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కొత్త రేషన్ కార్డుల జారీ విధివిధానాల కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని వేశామన్నారు. ఇక మీదట రేషన్ కార్డులపై సన్న బియ్యం అందచేస్తామన్నారు. కొత్త రేషన్ కార్టుల జారీతో ప్రభుత్వంపై అదనంగా 956 కోట్ల రూపాయల భారం పడుతుందని అన్నారు. కొత్తగా 36 లక్షల మందికి రేషన్ కార్డులు ఇవ్వాలని యోచిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీ పైన ఈ మధ్యాహ్నం జరిగే మంత్రిమండలి సమావేశంలో చర్చిస్తామన్నారు. కార్డుల జారీలో పాత పద్దతి కొనసాగుతుందన్నారు. రేషన్ కార్డుల్లో ఎలక్ట్రానిక్ చిప్ లు ఏర్పాటు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

**( DESK)**

## ASSEMBLY – SARPANCH' S BILL

గ్రామ పంచాయతీల సర్పంచులకు చెల్లించాల్సిన 691 కోట్ల రూపాయలకు పైగా ఉన్న బకాయిలను త్వరలో చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష సభ్యులు హరీష్ రావు అడిగిన పశ్నలకు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసుయ సీతక్క సమాధానం ఇస్తూ ఈ విషయం చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు ఈ ఏడాది నవంబర్ నాటికి ఈ బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. గ్రామాలలో చెపట్టిన అభివృద్ధి పనులకు, మూడు నెలల జీతాల క్రింద ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే తిరిగి చెల్లించాలని హరీష్ రావు కోరారు. బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ సభ్యలు కె. వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులు స్వంత నిధులతో అభివృద్ధి పనులను చేశారని, వారికి వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు కోవా లక్ష్మితో సహా పలువురు సభ్యులు ఈ అంశంపై మాట్లాడారు.

**(MSL)**

LEGISLATIVE COUNCIL - PONNAM PRABHAKAR

బీ సీ కులాల అభివృద్ధి కి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈరోజు సమాధానం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీ సీ డిక్లరేషన్ కు కట్టుబడి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. అందులో భాగంగానే కులగణన చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రాల్లో బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వం ఆత్మ గౌరవ భవనాల నిర్మాణాలకు 95 కోట్ల రూపాయలు కేటాయించి కేవలం 10 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. 42 ఆత్మ గౌరవ భవనాలకు భూములు కేటాయించి, వాటికి మౌలిక సదుపాయాలు కల్పించడాన్ని విస్మరించిందన్నారు.

(DESK)

**ASSEMBLY – PR ROADS**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, నివాస కాలనీలన్నిటికీ బీటీ రోడ్డు సదపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. ఈ మేరకు పనులను త్వరలో చేపట్టనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. బీటీ రోడ్డు సదుపాయం లేని గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో 334 ఉన్నాయని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో 12 వేల కోట్ల రూపాయలతో 17 వేల కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు వివరించారు. నల్లమల అడవుల సమీపంలో ఉన్న చెంచు పంచాయతీలకు రహదారి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు.

(MSL)

**COUNCIL - KONDA SUREKHA**

మహబూబ్ నగర్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ మాదిరిగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసనమండలిలో సభ్యుల

ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. ఆ ప్రాంతంలో విద్య, ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. పులి దాడుల్లో మరణించిన వారికి 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కవ్వాల్‌లో ఇటీవల పులులు దాడులకు పాల్పడుతున్నాయని, అమ్రాబాద్ అభయారణ్యంలో మాదిరిగా కవ్వాల్‌లోనూ చర్యలు తీసుకోవాలన్నారు. అడవి బిడ్డలు అడవిని ధ్వంసం చేయకుండా జీవిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఈ సందర్భంగా చెప్పారు. పులి దాడుల్లో మరణించిన వారికి 20 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని ఆమె కోరారు.

(DESK)

BRS - WALKOUT

సర్పంచుల బకాయిల చెల్లింపులపై స్పష్టమైన ప్రకటన చేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీలో సర్పంచుల పెండింగ్ బిల్లులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్న లేవనెత్తారు. ఒక్క నెలలోనే బడా కాంట్రాక్టర్లకు 1200 కోట్ల రూపాయలు చెల్లించిన ప్రభుత్వం, చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు ఇవ్వాల్సిన 691 కోట్ల రూపాయల నిధులను సంవత్సరకాలం నుంచి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నదని విమర్శించారు.

(DESK)

ASSEMBLY – BHATTI VIKRAMARKA

ఉద్యోగ ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షల నిర్వహించడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. అన్ని రకాల పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

(DESK)

**TS CABINET**

రాష్ట్ర మంత్రి వర్గం ఈ మధ్యాహ్నం రెండు గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్ లో ప్రత్యేకంగా సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు. కొత్త రెవెన్యూ చట్టం, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై చర్చించే అవకాశం ఉంది. ఇద్దరికి మించి పిల్లలున్న వారు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించేలా పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయనున్నట్లు తెలుస్తోంది. రైతు భరోసా విధివిధానాలపై చర్చించడంతో పాటుగా అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాల్సిన పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులకు దిశా నిర్దేశం చేసే అవకాశం ఉంది.

(DESK)

EBSB:

భిన్నత్వంలో ఏకత్వమే ప్రపంచానికి భారతీయ సంస్కృతి అందించిన మహత్తర సూత్రమని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చెప్పారు. కేంద్ర సమాచార ప్రసార శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ హైదరాబాద్ లోని సాలార్ జంగ్ మ్యూజియం లో ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శనను ఈ ఉదయం గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత్ ఎంతో వైవిధ్యభరితమైన దేశమని, ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ స్ఫూర్తి ని ఈ ప్రదర్శన ప్రతిబింస్తోందని గవర్నర్ అంటూ....

(Sound byte- Governor)

సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్, PIB అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్, PIB, సిబిసి అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెయింటింగ్ తో సహా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గవర్నర్ బహుమతులు ప్రదానం చేశారు.

(MSL)

**TS TEMPERATURE**

రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు చలి తీవ్రత  కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలర్టు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటుగా కామారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్,  సిద్దిపేట, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో  ఉష్ణోగ్రతలు 7 నుండి 10 డిగ్రీల లోపు నమోదైనట్లు తెలియచేసింది. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయని వెల్లడించింది.

(ప్రెస్ నోట్)

**VIJAY DIVAS**

దేశ వ్యాప్తంగా  విజయ్ దివాస్  వేడుకలు ఘనంగా  జరుగుతున్నాయి. 1971 యుద్దంలో పాక్ ను  భారత్  13 రోజుల్లోనే ఓడించి బంగ్లాదేశ్ కు విముక్తిని ప్రసాధించింది. ఆ పోరాటంలో మన సైనికుల పరాక్రమానికి గుర్తుగా  ఏటా డిసెంబర్ 16న విజయ్ దివాస్ ను జరుపుకుంటారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన సైనికుల  ధైర్య సాహసాలను కీర్తిస్తూ  అమరులకు నివాళులు అర్పించారు. దేశంలోని అన్ని ఆర్మీ క్యాంపుల్లోనూ అధికారులు అంజలి ఘటించారు.

(డెస్క్)

RAJYASABHA -AP

ఆంధ్ర ప్రదేశ్ నుండి  ఎన్నికైన ముగ్గురు సభ్యులు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వారి చేత ప్రమాణం చేయించారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్ బాబు, బీజేపీ నుంచి ఆర్.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

(DESK)